www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 4 జూన్ 2023

5

కాకినాడ

నేటి నుంచి పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

ఒడిశాలో రైలు ప్రమాదం కారణంగా పలు రైళ్లను ఈ నెల 3వ తేదీ శనివారం నుంచి 9వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ-రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం-విశాఖ, విశాఖ-కాకినాడ పోర్టు, కాకినాడ పోర్టు-విజయవాడ, గుంటూరు- విశాఖ, విశాఖపట్నం-విజయవాడ రైళ్లు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ఒడిషా రైలు ప్రమాద బాధితుల సహాయం కోసం హెల్ప్ డెస్క్‌ను నిర్వహిస్తున్నట్లు సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు. సమాచారం కోసం ప్రయాణికులు సామర్లకోట హెల్ప్ మొబైల్ నంబర్ 7382629990లో సంప్రదించాలని స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు.

ఊరూరా మద్యం బెల్ట్ షాపులు

- ఏరులై పారుతున్న మద్యం
- యథేచ్ఛగా అక్రమ అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు

పిఠాపురం మండలం కొత్త కందరాడలో బెల్టుషాపు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లాలో పలు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయి. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా చాలా చోట్ల విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. సమయపాలన అనేది లేకుండా ఎనీ టైం మందు ఏరులై పాంతోంది. అనేక ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలు బహిరంగంగానే జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

తమ పార్టీ అధికారంలోకి రాగానే మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తామని నాడు ప్రతిపక్షంలో ఉండగా జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే మద్యపానం నిషేధం హామీ మాట మరిచి భారీగా అమ్మకాలను పెంచారు. ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 382 మద్యం షాపులు, 43 బార్లు, వాక్ ఇన్ లిక్కర్ స్టోర్లు ఉండగా సాధారణ రోజుల్లో దాదాపు రూ.6 కోట్లు విక్రయాలు జరుగుతున్నాయి. ప్రత్యేక సందర్భాలు, పండుగల రోజుల్లో రోజూవారీ అమ్మకాలు రూ.8 నుంచి 16 కోట్ల దాటుతోంది. అయితే ప్రతి సంవత్సరం 20 శాతం చొప్పున ఐదేళ్లలో మద్యపాన నిషేధాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటన చేసినా క్షేత్రస్థాయిలో మద్యం అమ్మకాలు మరింత పెరిగాయి. మద్యం బెల్టు షాపులు ఎక్కడి కక్కడ విచ్చలవిడిగా వెలిశాయి. కాకినాడ జిల్లాలో తుని, పిఠాపురం, కోటనందూరు, రౌతులపూడి, గొల్లప్రోలు, కిర్లంపూడి, కరప, కాజులూరు, తాళ్లరేవు ఇలా పలు మండలాల్లో అనేక గ్రామాల్లో బడి, గుడి అనే తేడా లేకుండా మంచినీళ్లు దొరకని ప్రాంతాల్లో సైతం మద్యం అందుబాటులోకి వచ్చింది. పట్టణ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఉన్న పాన్ షాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం అమ్మకాలు పెరిగాయి. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలు అందుబాటులో ఉంటుండగా అక్కడ నుంచి కొనుగోలు చేసిన వివిధ బ్రాండ్లను బెల్ట్ షాపుల్లో అమ్ముతున్నారు. క్వార్టర్‌పై రూ.20 నుంచి రూ.30 అదనంగా తీసకుని విక్రయిస్తున్నారు. ఎపిలో దొరకని బ్రాండ్లు సైతం ఆయా బెల్టు షాపుల్లో లభిస్తున్నాయి. పొరుగు రాష్ట్రాల నుంచి ఇక్కడకు యథేచ్ఛగా రవాణా జరుగుతుండగా బెల్టు షాపుల్లో ఆయా బ్రాండ్లను అందుబాటులో ఉంచుతున్నారు. ఎపి ప్రభుత్వం నిర్వహిస్తున్న మద్యం దుకాణాల్లో రెగ్యులర్ బ్రాండ్లు అందుబాటులో ఉండటం లేదు. అధిక ధరలు వెచ్చించినా మందుబాబులకు కావలసిన బ్రాండ్లు లభించకపోవడంతో బెల్ట్ షాపులను ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇవి ఎక్కడికక్కడ విచ్చలవిడిగా తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఏ సమయంలో కావాలన్నా అమ్మకాలు సాగిస్తున్నారు.

పట్టని అధికారులు

జిల్లాలోని అనేక గ్రామాల్లో బెల్టుషాపులు బహిరంగంగానే అమ్మకాలు జరుపుతున్నా సంబంధిత ఎస్ఇబి అధికారులు పట్టనట్లే వ్యవహరిస్తున్నారు. కొందరు సిబ్బంది ఆయా షాపుల నుంచి మామూళ్లను దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కళ్లెదుటే విక్రయాలు జరుగుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తుంది. మరోవైపు అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులకు తెలిసినా బెల్ట్ షాపుల్లో విక్రయాలపై నోరు మెదపడం లేదు. ప్రభుత్వం ఒకపక్క మద్యం నియంత్రణకు హామీ ఇచ్చి మాట మార్చగా వైసిపి నేతలు అందుకు తగ్గట్టుగానే పట్టనట్లు ప్రవర్తిస్తుండడంతో ప్రభుత్వంపై పలువురు మహిళలు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు.

ఒడిశా ఘటనపై ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఒడిశాలోని బాలాసోర్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో కాకినాడ జిల్లా వాసులు ఎవరైనా చిక్కుకుని ఉంటే, వారి సహాయార్థం జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కతికా శుక్లా ప్రకటనలో తెలిపారు. సమాచారం కోసం 1800-425-3077 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కాకినాడ జిల్లావాసులు ఎవరైనా ఉన్నా వారి సమాచారం కూడా ఇవ్వొచ్చన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ తెలిపారు. పోలీస్ కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ 9490618506, పోలీస్ కంట్రోల్ రూమ్ 9494933233 నెంబర్లకు వివరాలు తెలియజేయాలన్నారు. కలెక్టరేట్‌లో మరో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు డిఆర్ఒ తెలిపారు. బాధితులు, బాధితుల తరఫున ఎవరైనా ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

మున్సిపల్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

కాకినాడలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-పెద్దాపురం, కాకినాడ

మున్సిపల్ కార్మికులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం నుండి బయలుదేరిన జాతా శనివారం పెద్దాపురం చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ సెంటర్లో నిర్వహించిన సభలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని, కనీస వేతనాలు అమలు చేస్తానని చెప్పారన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాతా నాయకులు దడాల గోవిందు, శేఖర్, రాజ్యలక్ష్మి, వర్రే గిరిబాబు, శివకోటి అప్పారావు, స్వామి, బాసిన భద్రరావు, రమణ, చేపల శ్రీను, శేఖర్, రాజబాబు పాల్గొన్నారు.

కాకినాడ సినిమా రోడ్డులోని నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిర్వహించిన సభలో ఉమామహేశ్వరరావు మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మికులకు సంఘాలు లేకుండా చేయాలని కార్మికులు బానిసలుగా పడి ఉండాలని నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని విమర్శించారు. కరోనా సమయంలో సుమారు 170 మంది మున్సిపల్ కార్మికులు మరణించగా వారి కుటుంబాలకు ఏ విధమైన ఆర్థిక సహాయం అందలేదని తెలిపారు. ముఖ్యమంత్రి ఆప్కోస్ ఏర్పాటు చేసి ఔట్సోర్సింగ్ ఉద్యోగులను మోసం చేశారని విమర్శించారు. 60 ఏళ్ల తర్వాత ఏ విధమైన రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా ఇంటికి పంపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు బట్టలు సబ్బులు నూనె చెప్పులు వంటి సౌకర్యాలు అందించక పోవడం శోచనీయమన్నారు. ధనాల వెంకట్రావు, గార్లపాటి లక్ష్మి, బంగారు వరలక్ష్మి, తుట్టా నూకరాజు, నాయుడు తదితరులు మాట్లాడుతూ గత ప్రభుత్వం తెచ్చిన జిఒ నెం. 279కు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించామన్నారు. జీతాల పెంపుదల కూడా సమ్మె తరువాతనే సాధ్యం అయ్యిందన్నారు. అందువల్ల మున్సిపల్ కార్మికులు సంఘటితమై పోరాడాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ ఇటీవల ఇతర రాష్ట్రాల్లో కార్మికులు పట్టు వదలని పోరాటాలు చేసి విజయాలు సాధించారని, మున్సిపల్ కార్మికులు కూడా ఆ విధంగా పోరాడాలన్నారు. సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకట రమణ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నక్కెళ్ల శ్రీనివాస్, నగర ఉపాధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ, ఎపిఎంఎస్ఆర్‌యు. నగర అధ్యక్షుడు ఎం.ఎ.స్వామి, విద్యార్థి సంఘం నాయకుడు రాజా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బంగారు సత్తిబాబు, నాయకుడు జలగడుగుల శ్రీనివాస్, భవిరిశెట్టి గురుమూర్తి, యర్రంశెట్టి నాగబాబు, రెడ్డి శ్రీను, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు మందపల్లి సూర్య ప్రకాష్, నాయకులు కొల్లి శ్రీనివాస్, చక్రధర్ శ్రీనివాస్, దుర్గా ప్రసాద్, వసాది లోకేష్, పోసయ్య, లక్ష్మీనారాయణ, క్లాప్ డ్రైవర్స్ అధ్యక్షుడు ఎం.శివ శంకర్, నాయకులు టి.గంగాధర్, ఎ.రాము, మరియు మధు, బుజ్జి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర బందం నాయకులు కాకినాడ మున్సిపల్ సీనియర్ వర్కర్ చెన్న బాబులును కలిసి పరామర్శించి ముమ్మిడివరం వైపు సాగిపోయారు.

గ్రూప్-1 పరీక్షా కేంద్రంలో కలెక్టర్ తనిఖీలు

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి-కాకినాడ

ఎపిపిఎస్‌సి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభమైన నేపథ్యంలో శనివారం కాకినాడ జెఎన్‌టియు విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా, ఎఎస్‌పి పి.శ్రీనివాసు, రెవిన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. పరీక్షల నిర్వాహణ, అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను కలెక్టరు కతికా శుక్లా ఈ సందర్భంగా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జెఎన్‌టియుకెలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో రెండు బ్లాకుల్లో 460 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరువుతున్నారని ఆమె తెలిపారు. తొలి రోజు తెలుగు పరీక్షకు సంబంధించి 460 మందికి 365 మంది అభ్యర్థులు హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో కలెక్టరు వెంట లైజనింగ్ ఆఫీసర్ కె.సుబ్బారావు, చీఫ్ సూపరింటెండెంట్, ప్రిన్సిపల్ రత్నకుమారి, ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీ బిఎస్ఆర్.మూర్తి, ఎఎస్ఒ బివివిఎస్.శేఖర్, అర్బన్ తహసీల్దార్ సీతాపతిరావు ఉన్నారు.

శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ

ప్రజాశక్తి -కరప

వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షణ పథకం పత్రాలను ఎంఎల్ఎ కురసాల కన్నబాబు శనివారం రైతులకు అందించారు. స్థానిక చంద్రన్న సమావేశ భవనంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు అధ్యక్షతన తహశీల్దారు పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ కురసాల కన్నబాబు హాజరయ్యారు. తొలుత ఒడిశా రైతు ప్రమాద మృతులకు సంతాపం తెలిపారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతు భూ సర్వే 100 సంవత్సరాల క్రితం జరిగిందని, మరల ఇప్పుడు ప్రతిష్టాత్మకంగా ప్రతి లబ్ధిదారుడు అయిన రైతు శాశ్వత భూహక్కు, భూరక్షణ పథకం పత్రాలను జగన్ ప్రభుత్వం అందించడం గర్వకారణం అన్నారు. సమాజంలో రెవెన్యూ శాఖ చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తోందన్నారు. గ్రామాల్లో విఆర్ఒలు రైతులు, రెవెన్యూ శాఖకు వారధిగా ఉంటారన్నారు. కొందరు విఆర్ఒలు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి నిబంధనల ప్రకారం పత్రాలు కేటాయించకుండా కావాలని గందరగోళం సష్టిస్తున్నట్టు, సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నట్టు తమకు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఇప్పటికైనా వారి ప్రవర్తన మార్చుకుని సక్రమంగా విధులు నిర్వహించాలని లేనిపక్షంలో శాఖపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహశీల్దారు పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో 19 గ్రామాలకు 15 గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యిందన్నారు. దఫదఫాలుగా వచ్చిన 11,572 భూహక్కు పత్రాలను రైతులకు అందిస్తున్నామన్నారు. ఈ 15 గ్రామాలకు మొత్తం 19,667 రాళ్లు పాతించినట్టు తెలిపారు. ఎంపిడిఒ కె.స్వప్న, ఆర్ఐ పి.మాచరరావు, జెడ్‌పిటిసి వై.సుబ్బారావు, వైసిపి మండల అధ్యక్షులు చింతా ఈశ్వరరావు పాల్గొన్నారు.

పైడాలో పాలిటెక్నిక్ కోర్సులకు ప్రవేశాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పైడా పాలిటెక్నిక్స్ కళాశాలల పరిధిలో పశు సంవర్ధక, మత్స్యశాస్త్ర, వ్యవసాయ డిప్లొమా కోర్సులకు 2023-24కు ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విద్యాసంస్థల చైర్మన్ పైడా సత్య ప్రసాద్ పేర్కొన్నారు. గ్రామీణ యువత డిప్లొమా కోర్సుల ద్వారా త్వరగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పైడా కళాశాల చైర్మన్ పైడా సత్య ప్రసాద్ అన్నారు. వివరాలకు 9492610674, 7382315999 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

పోలీస్ స్టేషన్ భవనం పరిశీలన

ప్రజాశక్తి -రౌతులపూడి

ప్రభుత్వం ఇటీవల నూతనంగా రౌతులపూడి కేంద్రంగా పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేయడంతో జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్, ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ శనివారం పోలీసు స్టేషన్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి సతీష్ కుమార్ మాట్లాడుతూ రౌతులపూడి కేంద్రంగా త్వరలోనే పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట ప్రత్తిపాడు సిఐ కిషోర్ బాబు స్థానిక నాయకులు ఉన్నారు.

బాలుని తండ్రి వద్దకు చేర్చిన పోలీస్

ప్రజాశక్తి-ఏలేశ్వరం

తప్పిపోయిన బాలుని అతని వద్దకు చేర్చి ఏలేశ్వరం పోలీస్ పలువురు ప్రశంసలు అందుకున్నాడు. ఈ మేరకు ఎస్ఐ జి.సతీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డతీగల మండలం గిరిజన గ్రామమైన మట్లపాడుకు చెందిన బాలుడు తండ్రితో వచ్చి ఏలేశ్వరంలో గురువారం తప్పిపోయాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి సెంట్రీ డ్యూటీలో ఉన్న శ్రీనుకు స్థానికులు అనుమానాస్పదంగా తిరుగుతున్న బాలుని తీసుకొచ్చి అప్పగించారు. బాలునిది మట్లపాడు అని తెలుసుకున్న శ్రీను స్వయంగా తీసుకెళ్లి ఆ కుటుంబ సభ్యులకి అప్పగించాడు. దీంతో బాలుని తండ్రి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి కోసం మహిళల ధర్నా

ధర్నా చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

తూరంగి పంచాయతీ అల్లూరి సీతారామరాజు కాలనీలో నెల రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు శనివారం సచివాలయం వద్ద మహిళలు ధర్నా నిర్వహించారు. నీటి సమస్యను సచివాలయ కార్యదర్శి రేవతి దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె వెంటనే స్పందించి ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కక్కుల లక్ష్మి మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో తమకు మంచినీరు రావడం లేదని వాపోయారు. పంచాయతీ కుళాయిల్లో వచ్చిన నీరు ఆకుపచ్చగా మురికి వాసనతో ఉందన్నారు. మే నెలలో ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేసేవారని జూన్ నెల వచ్చినా నేటికీ తాగునీరందించ లేదన్నారు. మహిళలు ఆందోళన చేసిన తరువాత ఒక ట్యాంక్ నీటిని మాత్రమే పంపించారని ఆమె తెలిపారు. సిపిఎం నాయకులు చింతపల్లి అజయ్ కుమార్ మాట్లాడుతూ బుల్లెబ్బాయి నగర్‌లో ఉన్న మంచి నీటి చెరువుపై తగిన పర్యవేక్షణ లేక, ప్లాంట్ అభివద్ధి పనులు చేపట్టక పోవడమే దీనికి కారణమన్నారు. అనంతరం బుల్లెబ్బాయి నగర్ ఉన్న ప్లాంట్‌ను నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జోగా అప్పారావు, వాసంశెట్టి మంగ, కణితి సుభలక్ష్మి, పొట్నూరి సత్యవతి, వేపాడ నాగమణి, షేక్ ఖాదర్, భవానీ, దుర్గ పాల్గొన్నారు.

విద్యార్థులకు జాతీయ ప్రతిభా స్కాలర్‌షిప్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్, కాజులూరు

సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు జాతీయ ప్రతిభాన్వేషణ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారని హెచ్ఎం మీనా మాధురి తెలిపారు. స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన 8వ తరగతి విద్యార్థినులు ఈరుగుల సత్యమనీష, కాసిరెడ్డి గాయత్రి, పురుషోత్తం అనుశ్రీలను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఎంపికైన విద్యార్థులకు ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్ అందిస్తారని మీనా మాధురి తెలిపారు.

జాతీయ ప్రతిభ స్కాలర్‌షిప్‌కు నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కాజులూరు ఎంఇఒ కెవివి.సత్యనారాయణ తెలిపారు. శనివారం మండల విద్యాశాఖ కార్యాలయంలో సత్యనారాయణ విలేకరులతో మాట్లాడారు. జాతీయ ప్రతిభా స్కాలర్‌షిప్‌కు కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన సత్యలక్ష్మీ దుర్గ, ఐతపూడి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి మాసగిరి అభిషేక్, శీల జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఆదిరెడ్డి మాధురి, తణుకువాడ జిల్లా పరిషత్ పాఠశాల నుంచి వాసంశెట్టి చరణ్ దీప్తి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వీరిని పలువురు అభినందించారు.

మొదటి రోజే జెవికె కిట్లు అందించాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరచిన మొదటి రోజే విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన కిట్లు (జెవికె) అందించే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని డిఇఒ కెన్‌విఎస్.అన్నపూర్ణ ఆదేశించారు. మండలానికి సంబంధించి జెవికె స్టాకు పాయింట్‌ను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులందరూ పార్టీ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, బూట్లు వంటి ఇతర సామాగ్రిని అందించే విధంగా చూడాలన్నారు. నాణ్యత లోపంతో సామాగ్రి ఉంటే వెంటనే వాటిని తమ దష్టికి తీసుకురావాలన్నారు. మెరుగైన విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నందున వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా కిట్లు, నోట్ బుక్స్, షూస్, టెక్స్ బుక్స్, ఉన్న గదులను ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

హైవేపై వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

హైవేపై వాహన తనిఖీలు

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లిలో జాతీయ రహదారిపై వాహనాలను ఎస్ఐ వై.గణేష్ కుమార్ శనివారం తనిఖీ చేశారు. అధికంగా వాహనాలపై పెనాల్టీలు ఉన్నాయని, పూర్తిగా అవి కట్టాలని పలువురికి సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ ట్రైసన్, కానిస్టేబుల్ సతీష్ తదితరులు ఉన్నారు. వేసవికాలం కావడంతో ఆరు బయట నిద్రించేటప్పుడు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ గణేష్‌కుమార్ సూచించారు. మల్లేపల్లిలో నిర్వహించిన వారధి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పశువుల నీటి కుండీ పరిశుభ్రం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న పశువుల నీటి కుండీని పరిశుభ్రం చేసినట్లు మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ కృష్ణ జీవప్రసాద్ తెలిపారు. ఈ నెల 1న ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన 'పచ్చ బారిన పశువుల నీటి కుండీ' వార్తకు స్పందించి కుండీని శుభ్రం చేసినట్లు ఆయన తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో ఆజాదీ అమత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన చెరువు పనులను శనివారం కాకినాడ జిల్లా టీం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో మల్లేపల్లి, తాళ్లూరు, పి.సూరంపాలెంలో ఆయా గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో చెరువుగట్లులను పరిశీలించారు.

కార్టూ'నిజం'



విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అవసరం

పెద్దాపురంలో శిక్షణ తరగతుల్లో పాల్గొన్న రవికుమార్

ప్రజాశక్తి - పెద్దాపురం

చిన్ననాటి నుండి శాస్త్రీయ దక్పథం అలవర్చుకోవడం ద్వారానే ఆధునిక సాంకేతిక విజ్ఞానంపై అవగాహన పెరుగుతుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ చల్లా రవికుమార్ అన్నారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో శనివారం ఆయన విద్యార్థులకు సైంటిఫిక్ టెంపర్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచన దక్పథాన్ని అలవర్చుకోవడం ద్వారానే వారు నేర్చుకున్న విజ్ఞానమంతా సమాజ పురోగతికి ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటివరకు సైన్స్ అనేక కొత్త ఆవిష్కరణలను ప్రపంచానికి అందించిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణలను అందించవలసిన బాధ్యత నేటి బాలలపై ఉందన్నారు. ప్రశ్నించడం ద్వారానే విజ్ఞానం అభివద్ధి చెందుతుందన్నారు. శాస్త్రీయ దక్పథాన్ని పెంచుకోవడం ద్వారా మూఢనమ్మకాలను వదిలించుకోగలుగుతామన్నారు. దుంగల పూజితా సూర్యశ్రీ, నీలపాల బాలమురళీకష్ణ, అమత, నమ్రత, కూనిరెడ్డి రవి పలు అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రొంగల అరుణ్, కూనిరెడ్డి అరుణ, దారపురెడ్డి కృష్ణ, మంజుల, ఐశ్వర్య, సూరజ్ పాల్గొన్నారు.

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భళ్లమూడి నాగమణి విద్యార్థులకు పాటలు పాడటం, పద్యాలాపనపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగం బుల్లయ్య, మరియమ్మ పాల్గొన్నారు.

యు.కొత్తపల్లి విద్యార్థులకు ఉప్పాడ గ్రంథాలయంలో క్రాఫ్ట్ శిక్షణా తరగతులు నిర్వహించారు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం 27వ రోజుకు చేరుకోవడంతో ఈ శిక్షణ తరగతులను 20 మంది విద్యార్థులకు ఉపాధ్యాయురాలు టి.నళిని, శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు.

తాగునీటి సమస్యపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

శశికాంత్ నగర్ వాటర్ హెడ్ ట్యాంక్స్ నుంచి కొంతకాలంగా అపరిశుభ్ర తాగునీరు వస్తోందని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ చాలా ప్రాంతాల్లో కలుషితమైన తాగునీరు సరఫరా జరుగుతోందని తెలిపారు. కార్పొరేషన్ అధికారులు, పాలకవర్గాలకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా సమస్యకు పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదన్నారు. శశికాంత్ నగర్ వాటర్ హెడ్ ట్యాంక్స్‌ను శుభ్రపరిచి స్వచ్ఛమైన త్రాగునీరు సరఫరా జరిగే వరకు రాజా ట్యాంక్స్ నుండి నగరవాసులకు తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుమ్మల రమేష్, గుజ్జు బాబు, గుమ్మళ్ల చిన్న పాల్గొన్నారు.

ప్రకృతి ఆరాధనతో ఒత్తిడి మాయం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ప్రకృతి దృశ్యాల ఆరాధనతో ఒత్తిడి, నిరాశ దూరమవుతాయని గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రకతి ఆరాధకుల దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మనదేశంలో సహజ సిద్ధంగా ఏర్పడిన ప్రకతి అందాలకు కొదవలేదన్నారు. దట్టమైన అడవులు, కొండ ప్రాంతాలు, నదులు, సరస్సులు, జలపాతాలు ఇలా ఎన్నో ఉన్నాయన్నారు. ప్రకృతి ఆరాధకులకు ఇలాంటి ప్రాంతాలు కనుల విందు చేస్తాయని అన్నారు. పిల్లలనుంచి వద్ధుల వరకు కూడా విహారయాత్రలు చేయడానికి ఆసక్తి చూపడం మంచి పరిణామం అని సుబ్బారావు తెలిపారు.

నేరాలు ఘోరాలు

ఆస్తి కోసం అక్కను చంపిన తమ్ముడు

ప్రజాశక్తి - అంబాజీపేట

ఆస్తి తగాదాలతో అక్కపై తమ్ముడు గునపంతో దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన శనివారం వాకలగరులో చోటు చేసుకుంది. బొక్కా కృష్ణవేణి (48) విదేశాల నుంచి వచ్చి గత 8 నెలల క్రితం తన స్వగ్రామమైన వాకలగరువులో ఉంటోంది. ఆమె భర్త నుంచి విడాకులు తీసుకొని తన తమ్ముడు కొడుకుని దత్తత తీసుకొని తమ్ముడి ఇంటి వద్దే జీవనం సాగిస్తోంది. శనివారం ఆమె తమ్ముడు గునపంతో ఆమె తలపై మోది హత్య చేశాడు. చనిపోయిన కృష్ణవేణికి ఆస్తితగాదాలే కారణమని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

పటిష్టంగా లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు

ప్రజాశక్తి - పెద్దాపురం

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేసేందుకు అందరూ కృషి చేయాలని ఆర్‌డిఒ జె.సీతారామారావు అన్నారు. శనివారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం అమలుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ చట్టాన్ని పగడ్బందీగా అమలు చెయ్యకపోతే సామాజికంగా స్త్రీ, పురుష నిష్పత్తిలో అసమానతలు చోటుచేసుకుని సమాజంలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఒ డాక్టర్ పి.సరిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ లింగ నిర్ధారణ పరీక్షలు జరిపే కేంద్రాలపై పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ సుదీప్తి, డాక్టర్ సాయికిరణ్, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ సుప్రియ, హెచ్‌వి.వీరలక్ష్మి, న్యాయవాదులు సత్య రవికుమార్, కందుల వెంకటచలం తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ ప్రయోజనాల కోసం విత్తన మహోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని రైతాంగ ప్రయోజనాల కోసం ఈ నెల 12న వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విత్తన మహోత్సవం నిర్వహించనున్నట్టు పెద్దాపురం ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ మహోత్సవంలో వివిధ పంటల రకాల విత్తనాల ప్రదర్శనలతో పాటు విత్తనాల అమ్మకాలు కూడా జరుగుతాయన్నారు. వరిలో మారుటేరు బిపిటి, చీడపీడలను తట్టుకునే మచిలీపట్నం, నెల్లూరు రకాలు, మినుములో ఎల్‌బిజి, జిబిజి, టిబిజి, ఐపిఎం రకాలు, సెనగలో ఎన్‌బిఇజి, వేరుసెనగ, నువ్వులు, రాగులు, కొర్రలు, జొన్న రకాల విత్తనాలు ప్రదర్శించారు. శాస్త్రవేత్తలు వాటి లక్షణాలను రైతులకు వివరిస్తారన్నారు.

రారెత్తిస్తున్న ఎండలు..

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో వేసవి ఉష్ణోగ్రతలు రారెత్తిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోహిణీ కార్తె నేపథ్యంలో రాజమహేంద్రవరంలో వారం రోజులుగా సరాసరి 43 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడగాల్పులు నానాటికీ అధికమవడంతో ప్రజలు ఇళ్లనుంచి బయటకు వెళ్లేందుకు సైతం వెనకడుగు వేస్తున్నారు. జిల్లాలో వడదెబ్బ కారణంగా మృతి చెందిన సంఘటనలు మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. భానుడు ధాటికి ఉదయం 9 గంటల నుంచి ఎండ తీవ్రత అధికమవుతోంది. దీంతో మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకూ జిల్లాలో అనేక ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థలు, నగరపాలికలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలతో ఊరట లభిస్తోంది. ప్రయాణికులు దాహార్తిని తీర్చుకునేందుకు దోహద పడుతున్నాయి. మరో వైపు విద్యుత్ కోతలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. విద్యుత్ వినియోగం జిల్లాలో 21 మిలియన్ యూనిట్లకు చేరటంతో అప్రకటిత విద్యుత్ కోతలు అనివార్యంగా మారాయి. మరోవైపు ఈదురు గాల్పులు కారణంగా ఉమ్మడి జిల్లాలో స్తంభాలు కూలిపోయి కొన్ని ప్రాంతాల్లో 24 గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడటతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉక్కపోత, ఉమ్మదీతలతో అవస్తలు పడ్డారు.

గోదారి గలగలలు

మహానాడుతో టిడిపిలో నూతనోత్సాహం

ఈ వారాంతంలో నిర్వహించిన టిడిపి మహానా రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి జిల్లాలోని వేమగిరి వేదికైన విషయం విదితమే. మహానాడు సభను పురస్కరించుకుని ఎండను, వర్షాన్ని సైతం లెక్క చేయకుండా లక్షలాది మంది కార్యకర్తలు తరలిరావటం ఆ పార్టీలో నూతనోత్సాహాన్ని నింపింది. అధినేత చంద్రబాబు ప్రసంగం ఆద్యంతం కార్యకర్తలను ఉత్సాహపరిచింది. చివరిగా మేనిఫెస్టోను ప్రకటించి ప్రజల్లోకి తీసుకెళ్లాలనే పిలుపునివ్వటంతో ఎన్నికల శంఖారావం మోగింది. ఈ ప్రకటన అనంతరం రాష్ట్రం నుంచి జిల్లా స్థాయి నేతల వరకూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. తాము సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ఓర్వలేక శ్రీలంకతో పోల్చారని, ఇపుడు అదే సంక్షేమ బాట పట్టారనే విమర్శలు వ్యక్తం చేశారు. మరి కొంత మంది 'ఆల్ ఫ్రీ బాబు' ప్రకటించిన మేనిఫెస్టోలోని పథకాలు అమలయ్యేనా..? అంటూ ఎద్దేవా చేశారు. 2014లో విడుదల చేసిన మేనిఫెస్టోలో ఎన్ని అమలు చేశారనే విమర్శలు సోషల్ మీడియాలో ఊపందుకున్నాయి. మరో వైపు అంతే ధీటుగా తెదేపా సోషల్ మీడియా కూడా విరుచుకు పడింది. మాట తప్పము- మడమ తిప్పము అంటూనే వైసిపి విస్మరించిన సిపిఎస్ రద్దు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికుల పర్మినెంటు చేస్తామనే హామీలను బుట్టదాఖలు చేశారంటూ ప్రతి విమర్శలు సంధించారు. మొత్తం మీద ఆ రెండు పార్టీలు సంక్షేమం పేరుతో ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత మొండి చేయి చూపిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

రెజ్లర్ల ఆందోళనకు సంఘీభావం

లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా దేశ రాజధానిలో రెజ్లర్లు చేపట్టిన ఆందోళనతో బిజెపికి సెగమొదలైంది. దేశంతోపాటు అంతర్జాతీయంగా రెజ్లర్ల ఆందోళనలకు మద్దతు లభిస్తుంది. రైతు ఉద్యమ నేతలు సంఘీభావం తెలపటంతో ఉద్యమం మరింత ఊపందుకుంది. మరో వైపు వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, క్రీడా సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టి విశేష ప్రజా మద్దతు కూడగట్టాయి. ప్రముఖ క్రీడాకారులు సైతం ముందుకొచ్చి బిజేపీ తీరును ఎండగట్టడం దేశ వ్యాప్తంగా చర్చనీయాశంగా మారింది. మరో వైపు జిల్లాలో నిర్వహించిన ఆందోళనలు ప్రజలు ఆలోచింపచేశాయి.

ఒడిశా రైలు దుర్ఘటనతో జిల్లాలో టెన్షన్..

ఒడిశాలో రైలు దుర్ఘటనతో జిల్లాలో టెన్షన్ వాతావరణం నెలకొంది. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఆగివున్న గూడ్స్ రైలును ఢీకొట్టడం, ఎదుదరుగా వస్తున్న బెంగళూరు -హౌరా ఢీ కొట్టడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. జిల్లాకు చెందిన ప్రయాణికుల కోసం అధికార యంత్రాంగం చూపిన చొరవ సత్ఫలితాలను ఇచ్చింది. 34 మందిలో 27 మంది సేఫ్‌గా ఇంటిగా చేరినట్లు స్పష్టమైంది. మరో ఏగుగురు ప్రయాణికుల వివరాలు తెలియాల్సి ఉంది.

యానాం వార్తలు

ఆర్‌ఎఒకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

మద్యం బాబుల ఆగడాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - యానాం

మందుబాబులు కనకాల పేట పొలాల్లో మద్యం తాగి వాటిని తాగిన మైకంలో బద్దలు కొట్టడం వల్ల ఆ గాజు పెంకులు రైతులకు, ఆవులకు, గేదెలకు గుచ్చుకుపోయి ఆస్పత్రి పాలవుతున్నామని ఆర్‌ఎఒ మునిస్వామికి రైతులు శనివారం వినతిపత్రం అందించారు. వెంటనే అధికారులు తగు చర్యలు తీసుకుని పొలాల్లో ఎవరిని తాగకుండా నిరోధించాలని కోరారు. సిఐ షణ్ముగం, ఎస్‌ఐ నూకరాజుకు కూడా వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కోన సూరిబాబు, మాగాపు సుబ్బారావు, వంగ వీరబాబు, కోన చినసత్తియ్యా, కోన రామారావు కోన నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కికెట్ టోర్నీ విజేత కెవిఆర్ జట్టు

ప్రజాశక్తి - యానాం

యానాం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెట్టకూరు హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న సియాచిమ్ క్రికెట్ టోర్నమెంట్‌లో శనివారం ఫైనల్ మ్యాచ్‌లో రామా యూత్ -ఎ టీముపై కనకాలపేట కెవిఆర్ టీము ఘన విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన ఈ టోర్నీలో మొదట బ్యాటింగ్ చేసిన రామా యూత్ 24.1 ఓవర్లలో 134 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కెవిఆర్ జట్టు 16.3 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు కోల్పోయి 137 పరుగులు చేసి విజయం సాధించింది. కెవిఆర్ టీమ్ బ్యాట్స్మెన్ సునీల్ కాచర్ల అత్యధికంగా 52 బంతుల్లో 93 రన్స్ చేసాడు. గెలుపొందిన జట్లకు త్వరలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు పంతగడ సుమన్ బాబు తెలిపారు.

బిసిల రక్షణ చట్టంపై పలువురి హర్షం

ప్రజాశక్తి- తాళ్లరేవు

బిసిలకు రక్షణ చట్టం అంశాన్ని టిడిపి మేనిఫెస్టోలో చేర్చడం పట్ల పార్టీ అధినేత చంద్రబాబు చిత్రపటానికి తాళ్లరేవులో పార్టీ బిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కట్టా త్రిమూర్తులు, బిసి నాయకులు వాడ్రేవు వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యాలయ సమన్వయ కార్యదర్శి మందాల గంగసూర్యనారాయణ మాట్లాడారు. గత నెల 27, 28 తేదీల్లో రాజమండ్రిలో జరిగిన మహానాడులో చంద్రబాబు బిసిలకు రక్షణ చట్టంపై మేనిఫెస్టోలో చేర్చడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కట్టా త్రిమూర్తులు మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ కృషి మేరకు చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్ కల్పించాలని, ఆ మేరకు పార్టీపై ఒత్తిడి తీసుకురానున్నట్లు తెలిపారు. నీలపల్లి సర్పంచ్ చిట్టూరి నాగమణి, టేకుమూడి లక్ష్మణరావు, చిట్టూరి కల్కిమూర్తి, పిల్లి సత్తిబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, జిత్తుగ శ్రీనివాస్, దెయ్యాల జానీ, కుడిపూడి రామకృష్ణ, దుర్గాప్రసాద్, గంజా సూరిబాబు పాల్గొన్నారు.

కమిషనర్‌గా రామారావు బాధ్యతల స్వీకరణ

సామర్లకోట రూరల్ : నూతన కమిషనర్‌గా జె.రామారావు శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన నయీమ్ అహ్మద్ పొన్నూరు మున్సిపాలిటీకి బదిలీ కాగా గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి పదోన్నతపై జయ రామారావు స్థానికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రామారావు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రధానంగా తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి సమస్యలున్నందున వాటన్నిటిని పరిష్కరించేందుకు సిబ్బంది అందరితోనూ మున్సిపల్ కౌన్సిల్‌ను కలుపుకొని ముందుకు వెళ్ళనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మున్సిపల్ మేనేజర్ సీరెడ్డి అచ్యుతరాజు, ఆర్‌ఒ రఘుబాబు ఆయా శాఖల సిబ్బంది ఉద్యోగులతో సమావేశమై మున్సిపాలిటీ పరిస్థితిలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ మేనేజర్ అచ్యుతరాజు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు ఎనలేనివి

కాకినాడ రూరల్ : నేటి సవాలు వాతావరణంలో వివిధ దేశాలు, ప్రాంతాలు, మతాల మధ్య శాంతియుత వాతావరణం నెలకొల్పడంలో సైనికుల పాత్ర ఎంతో గొప్పదని ఆర్మీ విశ్రాంత ఉద్యోగి ఎస్.శ్రీ నగేష్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శాంతి పరిరక్షకుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ సరిహద్దుల్లో సైనికులు వారి కుటుంబాలకు, ప్రియమైన వారికి దూరంగా ఉంటూ శాంతి మరియు భద్రత కోసం రాత్రింబవళ్లూ కష్టపడుతున్నారని అన్నారు. సంఘర్షణ ప్రాంతాల్లో ప్రమాదాలను ఎదుర్కొంటున్న పౌరులను రక్షించడంలో కూడా విశేష కృషి చేస్తున్నారని అన్నారు. శాంతియుతమైన, స్థిరమైన దేశం కోసం సైనికులు తమ ప్రాణాలను కూడా కోల్పోతున్నట్టు తెలిపారు. అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ సైనికుల త్యాగాలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో రాజా, సుబ్బారావు, రాఘవరావు, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ వార్మింగ్ తగ్గించేందుకు కృషి

ప్రజాశక్తి-కాకినాడ

పోటీల విజేతలతో నిర్వాహకులు

గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించాల్సిన బాధ్యత అందరిపైనా ఉదని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి విఎల్‌ఎన్‌విఎస్.ప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎపి శాస్త్ర సాంకేతిక మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఎపి ఆధ్వర్యంలో వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. కాకినాడ కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. 46 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొని చక్కటి ప్రతిభను కనబరచారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు పెంచాలని పిలుపునిచ్చారు. సర్వశిక్ష అభియాన్ సమన్వయకర్త చామంతి నాగేశ్వర రావు మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ స్పృహ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ బేసిక్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ ఛైర్మన్ పివి.సుబ్బారావు, బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, అకడమిక్ కో ఆర్డినేటర్ కె.వెంకట్రావు, గ్రంథాలయ పాలకుడు డి.రవి కుమార్ పాల్గొన్నారు.

సైకిల్‌తో ఆరోగ్యకరమైన జీవనశైలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

అన్ని వయసుల వారి ఆరోగ్యాన్ని పెంపొందించడానికి, వ్యాధులను నివారించడానికి, చక్కని జీవనశైలికి ప్రతిరోజూ సైకిల్ తొక్కాలని బోట్ క్లబ్ వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోటార్ సైకిల్ కొనలేని పేదవారి వాహనం సైకిల్ అన్నారు. అయితే ఇటీవల ధనవంతులు కూడా ఆరోగ్యం కోసం సైకిల్ తొక్కుతున్నారని అన్నారు. సైకిల్ తొక్కడం వల్ల గుండె జబ్బులు, కొన్ని రకాల క్యాన్సర్లు ,మధుమేహం వంటి దీర్ఘకాలిక రోగాలు రాకుండా నివారించవచ్చు అని అన్నారు. సరళమైన, సరసమైన, శుభ్రమైన మరియు పర్యావరణానికి సరిపడే స్థిరమైన రవాణా సాధనం సైకిల్ అన్నారు. అందరూ సైకిల్ తొక్కడం వల్ల వాతావరణ కాలుష్యం నివారించడంతోపాటు పెట్రోల్ ఖర్చు కూడా ఉండదన్నారు. సమాజంలో సైకిల్ సంస్కృతిని పెంపొందించడానికి ప్రపంచ సైకిల్ దినోత్సవం జరుపుకుంటున్నామని అడబాల తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైకిల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సుబ్బారావు, ఎస్.శ్రీనగేష్, రాజా, రాఘవరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను గడువులోగా పూర్తిచేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

మనబడి నాడు-నేడు పనులను వేగవంతం చేసి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని మండల విద్యాశాఖ అధికారి డి.మురళి సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన అధ్యక్షతన మండల విద్యావనరుల శాఖ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పాఠశాలల అభివృద్ధి పనులపై ఆయన నాడు-నేడు ఎఇ అంబేద్కర్ రాంజీతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో చేపట్టిన రెండో విడత పనులను ఈ విద్యా సంవత్సర ఆరంభం లోపు పూర్తి చేయాలన్నారు. అలాగే నిర్మాణ పనులలో అలసత్వం వహించకుండా ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఉపాధ్యాయులకు సహకరించి ఎటువంటి నాణ్యత లోపం లేకుండా నిర్మాణాలు పూర్తి చేయాలని వారు ఆదేశించారు. అనంతరం పాఠశాలలలో జరిగిన పనుల నివేదికల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహా అన్నదానం చేస్తున్న దృశ్యం

శృంగార వల్లభ స్వామికి రూ3.39 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలోని శ్రీ శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ.2,62,630, అన్నదాన విరాళాల ద్వారా రూ.62,625, కేశఖండన ద్వారా రూ.13,900 ఆదాయం లభించిందని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహార ప్రసాదం, వేసవిని దృష్టిలో పెట్టుకుని మజ్జిగ పంపిణీ, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు అర్చకులు, ప్రజా ప్రతినిధులు కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, ఆలయ సిబ్బంది కష్ణ, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీకుమార్, గ్రామస్తులు సేవలందించారన్నారు.

జ్ఞానసముపార్జనతో నూతన ఆవిష్కరణలు

ప్రజాశక్తి -కాట్రేనికోన

పారిశ్రామిక పర్యటనకు వెళుతున్న శ్రీనివాస ఇంజినీరింగ్ విద్యార్థులు

ప్రతి విద్యార్థి సముపార్జించిన జ్ఞానాన్ని ప్రత్యక్ష అనుభవం ద్వారా పరిశీలించిన అనేక నూతన ఆవిష్కణలకు నాంది కలుగుతుందని చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్‌వి ఎస్. పరమేశ్వర రావు అన్నారు. బిటెక్ మొదటి సంవత్సరం చదువుచున్న విద్యార్థులు శనివారం పారిశ్రామిక పర్యటన చేశారు. తూర్పు గోదావరి జిల్లా కేశవరం లో గల కోకో కోల కంపెని పారిశ్రామిక కేంద్రాన్ని సందర్శించారు. ఆ పరిశ్రమ నందు గల శీతల పానీయాల తయారీ విధానమును ప్రత్యక్షంగా పరిశీలించారు. పర్యటన అనంతరం కళాశాలలో విద్యార్థులతో సమావేశము నిర్వహించారు. పారిశ్రామిక పర్యటన లో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ ఎం.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పి.రవి కిషోర్, నాగేశ్వరరావు, గంగా తులసి, ఝాన్సీ, ఎం.సుపర్ణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

మండల పరిధిలో కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు విడుదల చేసిన దృష్ట్యా పెండింగ్‌లో ఉన్న ఆర్‌బికె, వెల్నెస్ సెంటర్‌లు, తదితర భవన నిర్మాణం పనులు వేగవంతం చేయాలని ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి.శ్రీలలిత ఆదేశించారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల పరిధిలో అందరూ కాంట్రాక్టర్‌లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఎంపిడిఒ శ్రీలిత అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాలవారీగా పెండింగ్‌లో ఉన్న భవనాల పనులపై సమీక్షించి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పిఆర్ ఇంజనీరు కె.మణిమాల, ఇఒపిఆర్‌డి కర్రి హరికృష్ణ, సత్యారెడ్డి, కార్యాలయ ఎఒ విప్పర్తి వీరసాయిబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, కాంట్రాక్టర్‌లు పాల్గొన్నారు.

ఆనందరావు ఆత్మహత్యాయత్నానికి కారకులపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-అమలాపురం

దళిత యువకుడు దారా అనందరావు ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన మహిళా శక్తి జాతీయ కన్వీనర్ కొంకిరాజామణి డిమాండ్ చేశారు. శనివారం అమలాపురం శ్రీనిధి ఆస్పత్రిలో ఆనందరావును రాజామణి తదితరులు పరామర్శించారు అనంతరం నిజ నిర్ధారణ చేశారు. దౌర్జన్యం చేసిన వారిపై కేసు నమోదు చేయకుండా ఆనందరావుని చిత్రహింసలకు గురిచేసిన అంబాజీపేట ఎస్‌ఐ, సిఐ లను సస్పెండ్ చేయాలన్నారు. ఆనందరావుకు తల్లి దండ్రులు నుంచి హక్కుగా వచ్చి భూమిని ఆక్రమించడానికి ప్రయత్నించి, అర్ధరాత్రి అతనిపై దాడి చేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదుచేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆనందరావుకు న్యాయం చేయాలన్నారు. దారా రమణమ్మూర్తి, దారా భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ

కొత్తపేట ఆర్‌డిఒ ముక్కంటి

ప్రజాశక్తి -కొత్తపేట

ఎపి పౌరసరఫరాల కమిషనర్(విజయవాడ) ప్రభుత్వ నిబందనలు ప్రకారం అర్హులైన లబ్ధిదారులందరికీ అన్ని పథకాల ప్రయోజనాల సంక్షేమం కోసం రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆర్‌డిఒ ఎం.ముక్కంటి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాలెండర్‌లోని సంవత్సరానికి రెండుసార్లు అనగా జూన్, డిసెంబర్ నెలలో కొత్త రైస్ కార్డులు అందజేయవలసి ఉందన్నారు. ప్రస్తుతం జూన్‌లో అర్హులకు బియ్యం కార్డులు మంజూరు చేస్తారన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు అనుస రించి అర్హులైన వారు ముఖ్యంగా ఒంటరి వ్యక్తులు, ఆశ్రయం లేనివారు, సంచార కుటుంబాల లబ్ధిదారులు సంబందిత గ్రామ వార్డు సచివాలయం ద్వారా లబ్దిదారులను దరఖాస్తు చేసుకునే విధముగా అవకాశం కల్పించారన్నారు.

వినతిపత్రం అందిస్తున్న సత్యానందం

సర్వర్ సమస్యలపై వినతి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సర్వర్ సమస్యను పరిష్కరించాలని శనివారం ఎండియు ఆపరేటర్లు శనివారం తహాశీల్దారు లక్ష్మీ నరస కుమారిని కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికీ రేషన్ పంపిణీని సర్వర్ సమస్య వేధిస్తోందన్నారు. ఆ వీధిలో ప్రతి ఇంటివద్దా ఎండియు వాహనం వెళ్లి రేషన్ సరుకులు అందించాల్సి ఉండగా రేషన్ సరుకులు సబంధించిన సర్వర్లు సరిగా పనిచేయకపోవడంతో లబ్ధిదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. వేలి ముద్ర ఆధారంగా రేషన్ అందజేసే విధానం నుంచి వేలి ముద్ర పడని వారికి ఐరిష్ ద్వారా రేషన్ అందజేయడానికి మార్పు చేశారన్నారు. మార్పు సంగతి ఎలా ఉన్నా ఈ నెలలో సర్వర్ పూర్తిగా డౌన్ అయిపోయిందన్నారు. మండల పరిధిలో ఈ నెల 1వ తేదీ నుండి రేషన్ సరుకులు పంపిణీ చేయాల్సి ఉండగా 3వ తేదీ సమీపించినా సర్వర్ సమస్యలు పరిష్కరించకపోవడంతో ఒక్కొక్కరికీ రేషన్ సరుకులు అందజేయాడానికి సుమారు 30 నిమషాల నుండి 40 నిమిషాలు సమయం పడుతోందని ఆపరేటర్స్ వాపోతున్నారు. ఆపరేటర్స్ అధ్యక్షులు దర్శిపాటి సత్యానందం తదితరులు ఉన్నారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ :- ఫస్ట్‌ఫ్లోర్, పద్మజ థియేటర్ రోడ్డు, మల్కిపురం
- ఫస్ట్‌ఫ్లోర్, బస్టాప్ ఎదురు, దేవరపల్లి.
- ఫస్ట్‌ఫ్లోర్, గణేష్‌చౌక్ సెంటర్, రవీంద్రభారతి స్కూల్ దగ్గర, నిడదవోలు.
- ఫస్ట్‌ఫ్లోర్, ద్వారకా కాంప్లెక్స్, బస్టాప్ ఎదురు, విక్టరీ గార్డెన్ ప్రక్కన, రావులపాలెం

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 26.06.2023 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 324.58 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798

మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 91/2021

బిట్వీన్:
తమలంపూడి సత్యనారాయణ రెడ్డి, తండ్రి: కృష్ణారెడ్డి, R/o. డో.నెం. 3-82, మూలవీధి, పెదపర్తి గ్రామం, అనపర్తి మండలం, తూ॥గో॥జిల్లా, పిన్:533342. ...వాది

మరియు

ఏర్రపోతి విశ్వేశ్వరరావు, తండ్రి: సుబ్బారావు, డో.నెం. 10-18-4, మద్ది వారి వీధి, స్కూల్ ప్రక్కన, ప్రభాకర్ మాస్టరు, వీధి, ఎడిద, మండపేట మండలం, తూ॥గో॥జిల్లా, పిన్: 533234. ...ప్రతివాది

పై నెంబరు దావా గ్రంధమునకు గాను ప్రతివాది హాజరు నిమిత్తం మీకు ఎన్నిసార్లు కోర్టు సమన్లు /నోటీసులు పంపిననూ మీరు ఉద్దేశ్యంపూర్వకంగా సదరు కోర్టు సమన్లు /నోటీసులు త్రిప్పి వేయుచున్నారు. కావున **ది.20-06-2023న ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా మీ తరుపు అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను.** లేని ఎడల సదరు దావాను మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది)

టి.వి.వి.రమణమూర్తి, అడ్వకేట్, దుప్పలపూడి. సెల్: 96527 36367

పూడిక తీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

మేజర్ డ్రైన్లలో పూడిక తొలగింపు పనులను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు శనివారం పరిశీలించారు. వర్షాలు పడితే డ్రైన్లు మునిగే పరిస్థితి ఉన్నందున తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలోని చిన్న డ్రైనేజీలలో డీ-సిల్టేషన్ పనులు ప్రారంభిం చామన్నారు. మేజర్ డ్రైన్లను ఇంజనీరింగ్ విభాగం శానిటేషన్ విభాగం చేపట్టాల్సి ఉన్నందున సంబంధిత డిఇలు, ఎఇలు చొరవ తీసుకోవాలని ఎడిసి సూచిం చారు. ముందస్తు ప్రణాళిక లేకపోతే రానున్న వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉన్నందున ఇప్పటినుంచి తగిన జాగ్రత్తలు వహిం చాలని ఎడిసి నాగ నరసింహారావు కోరారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనులను కూడా ఆయన పర్యవేక్షించారు.

ఎలక్ట్రికల్ డివిజనల్ కార్యాలయం ఏర్పాటుకు డిమాండ్

ప్రజాశక్తి-కొత్తపేట

కొత్తపేట రెవెన్యూ డివిజన్ కేంద్రంగా కొత్తపేటలో ఎలక్ట్రికల్ డివిజన్ ఏర్పాటు చేయాలని చయాలనేయవలసి ఉందనికొత్తపేట టిడిపి నాయకులు ముత్యాల బాబ్జి, గుబ్బల మూర్తి డిమాండ్ చేశారు. శనివారాం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం అమలాపురం డిఇ కార్యాలయం పరిధిలో ఉన్న డివిజన్ ను రామచంద్రపురం లో కలిపే ప్రతిపాదనలు జరుగుతున్నాయన్నారు. కొత్తపేట డివిజన్ ఏర్పాటు అయ్యే వరకు యథాతథంగా ఉంచాలన్నారు. కొత్తపేట నుంచి రామచంద్రపురం 45 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. కొత్తపేట చుట్టు పక్కల ప్రాంతాల వారికి ఇబ్బంది అవుతుందన్నారు. ప్రజల సౌలభ్యం కోసం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేశారో అదే సౌలభ్యం కొరకు వెంటనే విద్యుత్ డివిజన్ ను కొత్తపేటలో ఏర్పాటు చేయలన్నారు.

ఉప్పలంకలో 'జనం కోసం పవన్'

ప్రజాశక్తి -కరప

మండలంలోని ఉప్పలంకలో శనివారం జనసేన పార్టీ రూరల్ ఇన్‌ఛార్జి పంతం నానాజీ జనం కోసం పవన్ కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. ఇళ్ల పట్టాలు ఇచ్చారు గాని స్థలాలు చూపించ లేదని, మత్స్యకార గ్రామమైనా చాలా మందికి సబ్సిడీ లోన్లు లేవు, వలలు, డిజిల్, బోట్లు, ఇంజన్లు ఇవ్వలేదని, స్మశాన వాటిక లేదని, ప్రజలు పంచాయతీ అధికారులకి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని తెలిపారు. తదేకం ఫౌండేషన్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చినా వైసిపి నాయకులు ఒప్పుకోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు సంగాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99189